



కామారెడ్డిలోని ధర్మశాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు : తుజాల్‌పూర్‌లో... : గాంధారి : గౌరారంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న గ్రామస్థులు

ఈనాడు కామారెడ్డి

శుక్రవారం అక్టోబరు 11, 2024

అంబరం పూల సంబరం

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: చిత్తూ చిత్తూల బొమ్మ, రామ రామనేమి ఉయ్యాలో.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో అంటూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలను గురువారం మహిళలు జరుపుకొన్నారు. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద సంబరాలు హోరెత్తాయి. ఆడిపాడిన మహిళలు బతుకమ్మలను నెత్తిన ఎత్తుకుని కుంటల్లో, చెరువుల్లో నిమజ్జనానికి తరలారు. అనంతరం సద్దులు ఆరగించారు. కామారెడ్డిలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.





బాన్సువాడ పట్టణంలో నిమజ్జనానికి తరలిన ప్రజలు



భిక్కనూరు: బస్వాపూర్‌లో సంబరాల్లో గ్రామస్థులు



మూడు తరాల ముచ్చట...






తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌లో భారీ బతుకమ్మలు : పెద్దకొడపగల్ మండలం బేగంపూర్ గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు : జిల్లాకేంద్రంలోని అశోక్ నగర్‌లో..

బతుకమ్మను బతికిద్దాం

- జిల్లాలో కొనసాగుతున్న లింగనిర్ధారణ పరీక్షలు
- ఆడబిడ్డను కడుపులోనే కడతేరుస్తున్నారు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఆడబిడ్డను ఎంతో గౌరవంగా, గౌరమ్మను కొలిచే పండగ. జిల్లాలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇదంతా ఓ వైపు. మరోవైపు జిల్లాలో పుట్టేది ఆడబిడ్డ అని తెలిస్తే కడుపులోనే కడతేరుస్తున్నారు. దిశానిర్దేశం చేయాల్సిన కొందరు వైద్యులు కాసులకు కక్కుర్తిపడి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ కడుపులో బిడ్డను కరిగించేస్తున్నారు. తాజాగా రాజంపేటలో మొబైల్ యంత్రం ద్వారా ఓ ఆర్‌ఎంపీ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న లింగనిర్ధారణ, గర్భస్రావాల తీరుపై కథనం.

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

జిల్లాకేంద్రంతో పాటు రాజంపేట, గాంధారి, లింగంపేట మండలాల్లో లింగనిర్ధారణ జరుగుతున్నాయి. స్కానింగ్ చేసి పుట్టబోయే బిడ్డ గురించి చెప్పి రూ.10 వేల నుంచి రూ.20 వేలు తీసుకుంటున్నారు. ఈ వ్యవహారం అక్కడి ఆర్‌ఎంపీ, పీఎంపీలతో పాటు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బంది సహకారంతోనే కొనసాగుతోంది. ఆడపిల్ల పుడుతుందని తెలుసుకున్నవారు లింగనిర్ధారణ చేసిన ఆసుపత్రి వైద్యుడి సూచనతో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు దవాఖానాల్లో అబార్షన్లు చేయించుకుంటున్నారు. ఇందుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లిస్తున్నారు. వైద్యుడు అబార్షను చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారులకు, పోలీసులకు తెలిసి తనిఖీలకు వస్తే.. గర్భిణి అనారోగ్యంతో ఉందని, ఏదో ఒక వ్యాధి పేరు చెప్పి వైద్యులు పంపిస్తున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి రాక

జిల్లాకేంద్రంలోని రహస్య స్కానింగ్ కేంద్రానికి జిల్లావాసులే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్ర, సిరిసిల్ల, మెదక్, సంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి గర్భిణులు వస్తున్నారు. జిల్లాలోని కొన్ని పల్లెల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు లింగనిర్ధారణకు మొబైల్ స్కానింగ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. గర్భిణుల ఇళ్లకు ఈ యంత్రాలను తీసుకొచ్చి పరీక్షలు చేస్తున్నారు. ఇళ్లలో వీలుకాకుంటే శివారు ప్రాంతాల్లో చేస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక నిఘా

- చంద్రశేఖర్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

లింగనిర్ధారణ పరీక్షలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఎక్కడైనా జరిగినట్లు తెలిస్తే ఆసుపత్రిని సీజ్ చేస్తాం. చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం. కొందరి వైద్యులపై దృష్టి పెట్టాలని పీహెచ్‌సీ వైద్యులకు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలకు ఆదేశాలు జారీచేశాం. ఆడపిల్లల విక్రయాలపై ఇతర శాఖల అధికారుల సమన్వయంతో నిఘా పెట్టాం. అవసరం లేకుండా గర్భస్రావం చేస్తే చర్యలు తీసుకుంటామని వైద్య నిపుణులను హెచ్చరించాం.

ఎలా చేస్తున్నారంటే..

గర్భిణులు మండల, డివిజన్ కేంద్రాల్లోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లకు వెళ్తే.. వారిని స్కానింగ్ కోసం కామారెడ్డి పట్టణంలోని ఆసుపత్రికి తీసుకెళ్తారు. అక్కడ స్కానింగ్ చేసి ఫలితం చెప్పి పంపిస్తారు. దీనికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు చెల్లించాలి. ఆడపిల్ల పుడుతుందని తెలుసుకున్నవారు అబార్షను చేయించుకోవాలనుకుంటే జిల్లాకేంద్రంలో టీఫా స్కానింగ్(శిశువు ఆరోగ్య స్థితిని తెలిపేది) చేయించుకొని లింగనిర్ధారణ చేసిన ఆసుపత్రికి రావాలి. ఆ స్కానింగ్ ఆధారంగా అబార్షన్ చేయడానికి అవసరమైన వైద్యం చేస్తారు. ఇందుకు రూ.35 వేల నుంచి రూ.50 వేలు తీసుకుంటున్నారు. జిల్లాకేంద్రంలో నెలకు 30 నుంచి 50 వరకు అబార్షన్లు జరుగుతున్నట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో లింగనిర్ధారణ కేంద్రం నిర్వాహకుడు

రాజంపేటలో యంత్రాలు స్వాధీనం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఒకరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలోని రాజంపేట మండలకేంద్రానికి చెందిన బల్ల రవీందర్ లింగ నిర్ధారణ చేస్తున్నాడన్న సమాచారంతో పట్టుకున్నారు. విచారణ అనంతరం గురువారం మరోసారి రాజంపేటలో దాడి చేసి స్కానింగ్ యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి రాజంపేటలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై టాస్క్‌ఫోర్స్ పోలీసులను 'న్యూస్‌టుడే' వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రైతు కష్టం.. కళ్లారా చూస్తూ

ఒక్కో రూపం.. అపురూపం

ఆమె పాడితే పరవశమే (6లో)

అక్రమార్కులపై చర్యలుండేనా..?

మొదటి విడత గొర్రెల పంపిణీలో అవకతవకలపై పూర్తయిన విచారణ

ఈనాడు, కామారెడ్డి

మొదటి విడత గొర్రెల పంపిణీలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలకు రంగం సిద్ధమైంది. జిల్లాలో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు 2022 లోనే నిర్ధారణ అయింది. దీనిపై శాఖాపరమైన విచారణ చేపట్టిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మమ అనిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సమర్పించిన కాగ్ నివేదికలో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో రూ.253కోట్ల మేర అవకతవకలు చోటు చేసుకున్నట్లు వెల్లడైన విషయం తెలిసిందే. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పంపిణీలో జరిగిన అక్రమాలను నిగ్గుతేల్చాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో చేపట్టిన విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడిన తీరుతో పాటు భాగస్వాములైన అధికారుల వివరాలతో కూడిన నివేదికను విచారణ అధికారులు గురువారం ప్రభుత్వానికి నివేదించారు.

జరిగింది ఇలా..

☛ జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆధారాలు లభించినట్లు సమాచారం. రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయకుండానే చేసినట్లు దస్త్రాలు సృష్టించిన విషయాలు తేటతెల్లం అయినట్లు తెలుస్తోంది. ☛ స్కూటీపై మహారాష్ట్ర నుంచి 105గొర్రెలను 197 కి.మీ మేర రవాణా చేసినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు రికార్డుల్లో పేర్కొన్న విషయాన్ని విచారణ అధికారులు గుర్తించారు. ఇందులో ఏఏ అధికారుల భాగస్వామ్యం ఉందనే వివరాలు నివేదికలో పొందుపర్చారు. ఇదే విధంగా కారులో 147గొర్రెలను 198కి.మీ మేర రవాణా చేసినట్లు దస్త్రాలు సృష్టించారు. వీటితో పాటు గొర్రెలను రవాణా చేసిన వాహనదారులకు నగదును చెక్కుల రూపంలో అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకు విరుద్ధంగా నగదు రూపంలో పైకం చెల్లించినట్లు ఓచర్లు సృష్టించి పెద్దమొత్తంలో స్వాహా చేసిన విషయాలు వెలుగు చూశాయి.

దుర్గాదేవిగా చాముండేశ్వరి



దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని చాముండేశ్వరీదేవి గురువారం దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, హారతి పూజలు నిర్వహించారు. చండీ హవనం, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

ఒత్తిడి నుంచి బయటపడితేనే మానసిక ఆరోగ్యం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒత్తిడి నుంచి బయటపడితేనే మానసిక ఆరోగ్యం ఒనగూరుతుందని జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఒత్తిడితో కలిగే నష్టాలు.. దాని నుంచి ఎలా బయటపడాలో వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి మాట్లాడుతూ.. జిల్లాలో ఎవరైనా మతిస్థిమితం లేనివారుంటే న్యాయమూర్తులను సంప్రదించాలన్నారు. విద్యార్థులు రిసీవింగ్-రిటెన్షన్-రిట్రీవింగ్ (ఆర్‌ఆర్‌ఆర్) విధానంలో చదివితే బాగా అర్థమవడమే కాకుండా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మాయ సురేష్, డిప్యూటీ డిఫెన్స్ న్యాయవాది మోహన్ రావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఖాన్, సాయిప్రణీత్, సాయికృష్ణ, కపిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్

ఎల్‌ఆర్‌ఎస్ సర్వే పక్కాగా చేపట్టాలి

పిట్లం, న్యూస్‌టుడే: ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతోన్న సర్వే తీరును ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌సీ కేంద్రం దస్త్రాలు పరిశీలించారు. ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందులు తనిఖీ చేసి, సక్రమంగా మందులు పంపిణీ చేయాలని సూచించారు. మరుగుదొడ్లు లేని కారణంగా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శి యాదగిరికి నోటీసులు జారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, వైద్యులు రవీంద్రకుమార్, విజయలక్ష్మి, ఎంపీడీవో కమలాకర్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



పిట్లంలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

డీఎస్సీలో ఎంపికైనవారు రిపోర్ట్ చేయాలి


కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఎంపికై నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు ఈ నెల 11వ తేదీలోగా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీఈవో రాజు ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని గది నం.223లోకి రావాలన్నారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి రూ.1600 చెల్లించాలంటూ..

మండలాల్లో పంచాయతీ కార్యదర్శుల నుంచి వసూళ్లు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటం ఉంచాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫొటో సైజు(20×24)ను కూడా ప్రభుత్వమే ఖరారు చేసింది. ఇంకేముంది కొందరు మండల అధికారులు సీఎం చిత్రపటానికి రూ.1600 వసూలు చేస్తున్నారు. నగదు చెల్లించి ఫొటోలు తీసుకుపోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశిస్తున్నారు. నగదు చెల్లించాలని వాట్సాప్‌లో పెట్టారు. ఈ వార్త పంచాయతీ కార్యదర్శుల గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. జిల్లాలోని కొన్ని మండలాల అధికారులు సీఎం చిత్రపటానికి రూ.1400 నుంచి 1600 వసూలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు మండలాల్లో డబ్బులు తీసుకుని ఫొటోలు పంపిణీ చేశారు. తాజాగా మరి కొన్ని మండలాల అధికారులు డబ్బులు తీసుకువచ్చి చిత్రపటం తీసుకువెళ్లాలని పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. పైస్థాయి అధికారులు ఆదేశించడంతో కార్యదర్శులు మౌనంగా ఉండిపోతున్నారు. పైగా ఈ బిల్లులను కూడా పంచాయతీ కార్యాలయం నుంచే పెట్టుకుంటారు. 'సీఎం చిత్రపటానికి డబ్బులు వసూలు చేయాలని మేము ఎవరికీ ఆదేశాలు ఇవ్వలేదు. మండలకేంద్రాల నుంచి ఫొటోలు పంపిణీ చేయాలని కూడా చెప్పలేదు. అలా డబ్బులు తీసుకున్నట్లు మా దృష్టికి రాలేదు.' అని డీపీవో శ్రీనివాస్ రావు అన్నారు.



వాట్సాప్‌లో చక్కర్లు కొడుతున్న సమాచారం

ఆమె పాడితే పరవశమే

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం



● స్వప్నరాణికి రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం

చిన్నప్పటి నుంచి పాటలపై ఆసక్తి పెంచుకున్నారు.. పాడుతా తీయగాలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎదుట ఆలపించి ప్రశంసలు అందుకున్నారు. సంగీతంలో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర, జాతీయస్థాయిలో ఖ్యాతిగడించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం అందుకున్నారు. కర్ణాటక సంగీతంలో ఇటీవలే డాక్టరేట్ పట్టా అందుకొని ఔరా అనిపించారు. ఆమే జిల్లా కేంద్రం జ్ఞానసరస్వతి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల కర్ణాటక సంగీత అధ్యాపకురాలు డా. స్వప్నరాణి.

అనేక ప్రదర్శనలు

అమ్మ లక్ష్మి, నాన్న ముత్తెన్న ప్రోత్సాహంతో శాస్త్రీయ కర్ణాటక గాత్ర సంగీతంలో శిక్షణ పొందారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి కర్ణాటక, హిందూస్థానీ అంశాల్లో డిప్లొమా, ఆచార్య నాగార్జున వర్సిటీలో బీఏ చేశారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయలో ఎంఏ చదివి, ఇటీవలే పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ అందుకున్నారు. నిజామాబాద్ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో 2004 నుంచి తాత్కాలిక, 2017 నుంచి శాశ్వత అధ్యాపకురాలిగా, అసిస్టెంట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పలు వేదికలపై త్యాగరాజు, అన్నమయ్య, ముత్తుస్వామి తదితరుల సంకీర్తనలు పాడారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, దిల్లీ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులు, సంగీత సమ్మేళనాల్లో పాల్గొన్నారు. తన శిష్యులకు త్యాగరాజ దివ్య ఆరాధనలో పాల్గొనే అవకాశం కల్పించారు. మారిషస్‌లో నిర్వహించిన సంగీత సమ్మేళనంలోనూ అలరించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నారు. వాసర వాణి స్వరార్చన, ప్రసన్నాంజనేయం, గోదావరి హారతి, క్రీస్తుతో సహవాసం వంటి ఆల్బంలు ఆమెకు మంచి పేరు తెచ్చాయి. కళాజ్యోతి, ఉగాది పురస్కారాలు అందుకున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారం అందుకుంటూ...

తోడ్పాటు అందిస్తా : స్వప్నరాణి

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, సంగీతంలో డాక్టరేట్ చేయడానికి స్ఫూర్తినిచ్చిన వారందరికీ కృతజ్ఞతలు. ముఖ్యంగా సంగీత గురువులు పాలకుర్తి రామకృష్ణ శర్మ ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. అంతర్జాతీయ స్థాయిలో ఇందూరు గాయకులు రాణించేలా నా వంతు తోడ్పాటు అందిస్తా.

రైతు కష్టం.. కళ్లారా చూస్తూ

● క్షేత్ర సందర్శనలో విద్యార్థినులు

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థినులు సాగు బాట పట్టారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్‌లో చివరి ఏడాది చదువుతున్న విద్యార్థినులు క్షేత్రస్థాయి సందర్శన చేపట్టారు. రైతులతో మాట్లాడుతూ.. పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి అనేక విషయాలు తెలుసుకుంటున్నారు.

బృందాలుగా ఏర్పడి..

మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలో సుమారు 60 మంది విద్యార్థినులు బృందాలుగా ఏర్పడి 5 నెలల పాటు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, కుప్రియాల్, పద్మాజీవాడి, తాడ్వాయి, కృష్ణాజివాడి, బ్రహ్మాజివాడి, కామారెడ్డి, లింగాపూర్ గ్రామాల్లో నివాసం ఉంటూ రైతులతో మమేకమవుతున్నారు. సాగు పద్ధతులు, రైతుల అనుభవాలు తెలుసుకుంటున్నారు. తరగతి గదుల్లో వారు నేర్చుకున్నవి రైతులకు వివరిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు రైతులకు, విద్యార్థినులకు ప్రయోజనకారిగా ఉంటాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రేవంత్‌నాథన్, అనిల్‌రెడ్డిలు పేర్కొన్నారు.




విత్తనశుద్ధిపై వివరిస్తున్న విద్యార్థినులు

అనుభవాలు తెలుసుకున్నా



\- అర్చన, వికారాబాద్

శ్రీజ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్



సాగులో రైతులు పాటిస్తున్న విధానాలు, అధిక దిగుబడులకు తీసుకునే చర్యలు తెలుసుకున్నాం. మేం పలు సూచనలు చేశాం. రైతులు పడుతున్న ఇబ్బందులు కళ్లారా చూశాం. తరగతి గదిలో చదివిన చదువుకు క్షేత్రస్థాయిలో సాగు విధానానికి చాలా వ్యత్యాసం ఉంది.

విత్తనశుద్ధి విధానాలు తెలియజేశాం



\- సిరిచందన, వెంకిర్యాల్, యాదాద్రి భువనగిరి

అభినయ, శంకర్‌పల్లి, వికారాబాద్



ప్రధాన పంటలైన వరి, చెరకు విత్తన శుద్ధి విధానాలను రైతులకు వివరించాం. అధిక దిగుబడినిచ్చే పద్ధతులు తెలిపాం. తరగతి గదిలో ప్రొఫెసర్లు పాఠాలు బోధిస్తే క్షేత్రస్థాయిలో రైతులు ఉపాధ్యాయుల్లా సాగు విధానాన్ని వివరిస్తున్నారు. భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలను తెలిపాం.

నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కుట్టు శిక్షణ, మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో ఉచిత శిక్షణలు ఇస్తున్నామని, ఇందుకు ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతులు, మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అందరికి 30 రోజుల పాటు ఉచితంగా వసతి, భోజనం, అందిస్తామన్నారు. అభ్యర్థులు శుక్రవారం నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తులను అందించాల్సి ఉంటుందని చెప్పారు. వెంట ఆధార్‌కార్డు, నాలుగు ఫొటోలు, రేషన్‌కార్డు, పాన్, బ్యాంక్ ఖాతా పుస్తకంతోపాటు రెండు సెట్ల జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు.

ప్రేమ్‌లాల్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు, సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఈ నెల 21న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు విజయ్‌కుమార్ నుంచి సమాచారం వచ్చినట్లు ప్రేమ్‌లాల్ తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ జేఎన్ స్టేడియంలో ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కామారెడ్డి జిల్లా క్రీడాకారులు తొమ్మిది పతకాలు సాధించినట్లు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. అండర్-20 విభాగంలో ఎం. ఈశ్వర్(800, 1500 మీటర్ల పరుగు)కు బంగారు, రజత పతకాలు దక్కాయి. అండర్-18 విభాగం జావెలిన్ త్రోలో బి. ఈశ్వర్ ప్రసాద్ బంగారు పతకం గెలుచుకున్నాడు. అండర్-20 విభాగం 400, 200 మీటర్ల పరుగులో సెహ్వాగ్ రజతం, కాంస్య పతకాలు సాధించాడు. అండర్-14 విభాగం ట్రైథ్లాన్‌లో ప్రవీణ్‌కు, అండర్-18 విభాగం డిస్కస్‌త్రోలో గౌతంకు రజత పతకాలు దక్కాయి. అండర్-16 విభాగం లాంగ్‌జంప్‌లో ఆనంద్, అండర్-14 విభాగం ట్రైథ్లాన్‌లో శ్రీను కాంస్య పతకాలు గెలుచుకున్నాడు.



ఈశ్వర్

ఆత్మరక్షణ విద్యలో ప్రతిభ

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆత్మరక్షణ విద్య తగ్-తా మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించారని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లవన్‌కుమార్, శిక్షకుడు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగిన ఖేలో ఇండియా జూనియర్ జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం నుంచి 23 మంది ప్రాతినిధ్యం వహించగా జిల్లా నుంచి తొమ్మిది మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇందులో నిఖిత, శ్రీనాథ్ కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు.



నిఖిత



శ్రీనాథ్



భిక్కనూరులో అమ్మవారి అవతారంలో..



కామారెడ్డిలో..



నిజామాబాద్ వాసవీమాత ఆలయంలో..



నిజామాబాద్ కిషన్‌గంజ్‌లో..



ఎండు ఫలాలతో..

ఒక్కో రూపం.. అపురూపం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మను గురువారం వైభవంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. భిన్న రూపాల్లో అమ్మవారి బతుకమ్మలు ఆకట్టుకున్నాయి.

– న్యూస్‌టుడే, భిక్కనూరు, కామారెడ్డి పట్టణం, నిజామాబాద్ సాంస్కృతికం

ఒకే ప్రయోగశాల.. తప్పని అగచాట్లు

● బోధనాసుపత్రిలో పెరిగిన రద్దీ

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

కామారెడ్డి బోధనాసుపత్రిలో రద్దీ బాగా పెరిగింది. వంద పడకల ప్రాంతీయాసుపత్రి నుంచి జిల్లా స్థాయి, ఆ తర్వాత బోధనాసుపత్రిగా మారింది. గతంలో 700-800 ఓపీ రాగా ప్రస్తుతం 1200 వరకు రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. రద్దీకి అనుగుణంగా వసతులు కల్పించడంలో అగచాట్లు తప్పడం లేదు. నెలకు 17 వేల నుంచి 25 వేల వరకు ఓపీ వస్తోంది. ఐపీ 1500-1900 వరకు ఉంటోంది. పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చినవారిలో కొందరి రక్త నమూనాల సేకరణకు ప్రయోగశాలకు పంపుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వందలాది మంది పరీక్షలకు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నెల	ఓపీ
జనవరి	27006
ఫిబ్రవరి	25213
మార్చి	32316
ఏప్రిల్	31587
మే	34409
జూన్	35248
జులై	27606
ఆగస్టు	32866
సెప్టెంబరు	32,150

స్థాయి పెరిగినా..

330 పడకల ఆసుపత్రిగా ఏర్పాటైనా ఇక్కడ వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. 13 విభాగాలు ఒకే చోట ఉండటంతో ఆసుపత్రి ఇరుకిరుకుగా మారింది. దీనికి తోడు రెండేళ్ల నుంచి అత్యధిక సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. అత్యవసరం అనుకున్నవారికి పరీక్షలు చేస్తున్నారు. సత్వర వైద్య సేవలు పొందాలని ఆసుపత్రికి వచ్చినవారికి చుక్కెదురవుతోంది.



కామారెడ్డి ఆసుపత్రిలో ప్రయోగశాల వద్ద రద్దీ (పాత చిత్రం)

మార్పు రావాలి

ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఇది వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది. ఎలాంటి వనరులు కల్పించకుండా వైద్యకళాశాలు ఏర్పాటుచేసి దానికి అనుబంధంగా ఇదివరకు ఉన్న జిల్లా ఆసుపత్రులను బోధనాసుపత్రిగా మార్చడంతో సమస్య ఎదురవుతోంది. ఈ విషయమై ఆసుపత్రి పర్యవేక్షణాధికారి రాంసింగ్ స్పందిస్తూ.. కొంత కాలంగా రద్దీ బాగా పెరిగిందన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటామన్నారు. వైద్య సేవల్లో లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అక్కా, చెల్లెళ్ల ఆత్మహత్యాయత్నం

☛ చికిత్స పొందుతూ చెల్లెలు మృతి

సదాశివనగర్ : కుటుంబ కలహాల నేపథ్యంలో అక్క ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా ఇది భరించలేని చెల్లెలు అక్కపై ప్రేమతో క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక సంఘటన సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. అక్కా చెల్లెలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా చెల్లెలు మృతిచెందింది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం... అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన గురజాల కిషోర్‌కు ఇద్దరు కుమార్తెలు. పెద్దకూతురు మమత(25)ను రామారెడ్డి మండలం మోషంపూర్‌కు చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. సాఫీగా జరుగుతున్న వారి కాపురంలో మనస్పర్థలు రావడంతో గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మమత పది రోజుల కిందట అడ్లూర్ ఎల్లారెడ్డి వచ్చింది. మానసికంగా కుంగిపోయిన మమత ఈ నెల 7వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకొంది. ఇది చూసిన చెల్లెలు ప్రత్యూష(23) కూడా పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఇద్దరినీ చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఇద్దరూ చికిత్స పొందుతుండగా చెల్లెలు ప్రత్యూష పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందింది. తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రత్యూష

సమాజ జాగృతికి నిరంతర కృషి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమాజాన్ని జాగృతం చేయడానికి, హిందువుల్లో సంఘటిత శక్తిని పెంపొందించేందుకు ప్రతి స్వయం సేవకుడు నిరంతరం కృషి చేయాలని, అందరిలో చైతన్యం నింపడమే కాకుండా తన కుటుంబం నుంచే కార్యాచరణ ప్రారంభించాలని హిందూ జాగరణ మంచ్ అఖిల భారత సహ సంఘటన మంత్రి దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రం హరిచరణ్ మార్వాడీ విద్యాలయంలో విజయదశమి మహోత్సవం నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన ఆయన ప్రసంగించారు. డాక్టర్‌జీ ఏ ఉద్దేశంతో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారో తెలుసుకొని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. రాబోయే శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సంఘ్ లక్ష్యాలను అమలు చేయాలన్నారు. మారుమూల గ్రామాలు, బస్తీల్లోనూ సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ప్లాస్టిక్ ముక్త భారత్, జలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకం, స్వదేశీ వస్తువుల వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగర కార్యవాహ సత్యం మాట్లాడుతూ.. వచ్చే నవంబరు 10న జిల్లాకేంద్రంలో ఐదు వేల మందితో సంచలనాన్ని ఏర్పాటు చేశామని, అంతా తప్పక హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ గురుచరణం తదితరులు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న దేవేందర్‌రెడ్డి, వేదికపై జిల్లా సంఘచాలక్ గురుచరణం, హాజరైన స్వయం సేవకులు, హిందూ సంస్థల ప్రతినిధులు

బిస్కెట్‌లో ఇనుప తీగ



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని దేవునిపల్లిలో ఓ కిరాణ దుకాణంలో కొనుగోలు చేసిన బిస్కెట్‌లో ఇనుప తీగ వచ్చింది. స్థానిక పిల్లలు గురువారం బిస్కెట్ ప్యాకెట్ కొనుగోలు చేసి ఇంటికి వచ్చి దానిని తినే ప్రయత్నం చేయగా అందులో తీగ కనిపించింది. అప్రమత్తమైన వారు వాటిని పారేశారు. ప్రముఖ సంస్థకు చెందిన ప్యాకెట్‌లో ఇలా తీగ రావడం ఆందోళన కలిగించిందని చిన్నారుల కుటుంబీకులు వాపోయారు.

భవానిపేటలో పండుగ పూట నీటి కష్టాలు

మాచారెడ్డి, కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మాచారెడ్డి మండలం భవానిపేట గ్రామస్థులు నీటి కష్టాలతో గురువారం రోడ్డెక్కారు. గ్రామంలో ఆరు నెలలుగా నీటి కష్టాలు ఎదుర్కొంటున్నా.. పంచాయతీ కార్యదర్శి పట్టింపులేనితనంతో సమస్య మరింత తీవ్రమైందన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ పూట ఖాళీ బిందెలతో రోడ్డెక్కాల్సి వచ్చిందని గ్రామస్థులు వాపోయారు. పోచమ్మగల్లీలో సమస్య తీవ్రంగా ఉందన్నారు.



పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం సూచించారు. రాంపూర్ గ్రామంలో బుధవారం డెంగీతో ఓ యువకుడు మృతిచెందగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం, ఆరోగ్య సిబ్బందితో కలిసి గురువారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామంలోని ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జ్వరం తీవ్రం అయ్యే వరకు చూడకుండా ఆసుపత్రికి వెళ్లాలన్నారు. జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్‌నాయక్, వైద్యాధికారి సంతోష్, ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, ఆరోగ్య కార్యకర్తలు స్వర్ణలత, రేణుక, ఆశ, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం

గుంతల దారి

దారి మొత్తం గుంతలతో ఉన్న ఈ మార్గం జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీకి వెళ్లే ప్రాంతం. బీటీ లేచి దారి ఛిద్రం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



ఈనాడు సినిమాలు

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్

విట్టయాన్ ది హంటర్	11.00	2.15	6.00	9.15
విశ్వం	11.00	2.00	6.00	9.00

వీ సినిమాస్

దేవర	10.50	2.15	5.50	9.30

ఏషియన్ దర్శన్

మార్టిన్	11.00	6.00
మా నాన్న సూపర్ హీరో	2.00	9.00

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242

జిల్లాకేంద్రంలోని పీహెచ్ కాలనీలో కాల్వ పూడిక పేరుకు పోయింది. - **ఈశ్వర్, పీహెచ్‌కాలనీ**



కాల్వ పూడిక తొలగించేలా చర్యలు చేపట్టాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- సాయిలు, అంబేద్కర్‌నగర్**



సిబ్బందితో వ్యర్థాలు తొలగించాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

జిల్లాకేంద్రంలోని శ్రీరాంనగర్‌లో మురుగు కాల్వకి ఇరువైపులా గడ్డి పెరిగింది. **- రాము, శ్రీరాంనగర్**

సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

బాన్సువాడ 12వ వార్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళలో ఇబ్బందిగా ఉంది. **విజయ్, బాన్సువాడ**



ఈ విషయాన్ని ఈఈఎస్ఎల్ పట్టణ పర్యవేక్షకుడు సాయికిరణ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరింపజేశారు.

కిష్టాపూర్ గేటు తండాలో కుళాయి నీరు రహదారి మీదకు పారడంతో బురదమయంగా మారి ఇబ్బందులు తప్పడం లేదు. **రవి, స్థానికుడు**

నీరు రోడ్డు మీదకు రాకుండా చర్యలు చేపడతాం. **గులాం హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి, కిష్టాపూర్**

- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం, కామారెడ్డి పట్టణం,పిట్లం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మాచారెడ్డి, న్యూస్‌టుడే: కాకులగుట్ట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ హన్మాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబానికి మాచారెడ్డి ఆటో యూనియన్ సభ్యులు ఆర్థికసాయంగా రూ.20 వేలు, 50 కిలోల బియ్యాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రవి నాయక్, ఉపాధ్యక్షుడు గాంధీ నాయక్, బుర్ర స్వామి గౌడ్, దూజిరాం, మోహన్, లక్ష్మాగౌడ్ తదితరలు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ భూములు క్రమబద్ధీకరిస్తాం

బీర్కూర్: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న ఎల్ఆర్ఎస్ భూములను క్రమబద్ధీకరిస్తామని డీఎల్పీవో నాగరాజు పేర్కొన్నారు. బీర్కూర్‌లో గురువారం నిర్వహించిన ఎల్ఆర్ఎస్ భూముల సర్వే పనితీరును తనిఖీ చేశారు. డీటీ రవికుమార్, ఎంపీవో మహబూబ్, పంచాయతీ కార్యదర్శి గంగారాం ఉన్నారు.

రావణ దహన ఏర్పాట్ల పరిశీలన

బాన్సువాడ, న్యూస్‌టుడే: విజయదశమిని పురస్కరించుకొని పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 12న జరగబోయే రావణ దహన కార్యక్రమ ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు. ఏర్పాట్లపై అధికారులు, బల్దియా యంత్రాంగంతో చర్చించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్ పాల్గొన్నారు.

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్ గురువారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కల్కి, ఎల్లయ్య, నాగయ్య, పాత బాన్సువాడ చెరువుల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. కమిషనర్ శ్రీహరి రాజుతో కలిసి ఆయా స్థలాలను సందర్శించారు.

డీసీసీబీ డైరెక్టర్‌కు సత్కారం

బీర్కూర్, న్యూస్‌టుడే: దామరంచ సొసైటీ ఛైర్మన్ కమలాకర్‌రెడ్డి డీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం బీర్కూర్, బరంగెడ్గి, దామరంచ, బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు దామరంచకు వచ్చి కమలాకర్‌రెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు. కృష్ణారెడ్డి, చందు, అఫ్సర్, రాంచందర్ ఉన్నారు.

సేవలు మరువలేనివి

గాంధారి, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి సందర్భంగా గురువారం మండలంలోని డీలర్లు, రైతుల ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ రంగాలల్లో రతన్ చేసిన సేవలను స్మరించుకున్నారు.



రతన్ టాటా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రైతులు, డీలర్లు

పోయిరావమ్మా.. బతుకమ్మ



బతుకమ్మతో చిన్నారి



వేడుకల్లో జిల్లా ఎస్పీ సింధుశర్మ కుటుంబ సభ్యులు



పిట్లంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు దంపతులు



బతుకమ్మలతో గద్దం ఇందుప్రియ, షబ్బీర్‌అలీ



కామారెడ్డి పాత బస్టాండు వద్ద...

జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. గ్రామాల్లో, ప్రధాన కూడళ్ల వద్ద ఆడిపాడారు. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మలను ఊరేగింపుగా స్థానిక నీటి వనరుల వద్దకు తీసుకెళ్లారు. అనంతరం నిమజ్జనం చేశారు. సద్దులు ఆరగించారు.

- న్యూస్‌టుడే , బృందం



నస్రుల్లాబాద్‌లో..



మాచారెడ్డిలో..



కామారెడ్డి: తిలక్‌రోడ్డులో ..సిరిసిల్లరోడ్డులో..



ఎర్రపహాడ్‌లో భారీ బతుకమ్మ తయారీ పనుల్లో...



బాన్సువాడలో బహుమతి అందజేస్తున్న పోచారం..



బిచ్కుంద: పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



మహ్మద్‌నగర్: మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ దఫేదార్ శోభ..



గాంధారి: శ్రీరామ్‌నగర్‌లో...



బాన్సువాడ: దుర్గమ్మ రూపంలో



కామారెడ్డిలో మహిళ...



మాచారెడ్డిలో..



అరగొండలో..





చుక్కాపూర్‌లో



కామారెడ్డి: బతుకమ్మ పేర్చుతున్న ఐకేపీ డీపీఎం సుధాకర్



రామారెడ్డి: రెడ్డిపేట్‌లో ...



లింగంపేటలో..



రామారెడ్డి : ఉప్పల్‌వాయిలో



బిచ్కుందలో..



జిల్లాకేంద్రంలో.. / గాంధారిలోని భోగేశ్వరాలయంలో / గాంధారి : గౌరారంలో.. / పాత బాన్సువాడ చావిడిలో... / బీర్కూర్‌లో..



బీబీపేట: రాంరెడ్డిపల్లిలో.. / జిల్లా కేంద్రంలో విద్యానగర్‌లో.. / భిక్కనూరు: రామేశ్వరపల్లి గ్రామంలో.. / ఎల్లారెడ్డి : సంబరాల్లో ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ ఛైర్మన్ శ్రీకాంత్, ఎస్సై మహేశ్ / పుల్కల్‌లో .. / కోమలంచలో .. / బిచ్కుంద: బతుకమ్మను పేరుస్తున్న మహిళలు / పిట్లం: అల్లాపూర్‌లో / పిట్లం: తిమ్మానగర్‌లో / చిన్నమల్లారెడ్డిలో..



తాడ్వాయిలో .. / రాంపూర్‌కలాన్‌లో .. / తుజాల్‌పూర్ శివారులో .. / పిట్లం: నిమజ్జనానికి తరలిస్తూ... / గాంధారి : పెద్దవాగులో నిమజ్జనం

ఉపాధ్యాయులకు సన్మానం

ఇస్సన్నపల్లి(రామారెడ్డి), న్యూస్‌టుడే: డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయురాలు ప్రియాంకను కాంగ్రెస్ నాయకులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందూరి లింబాద్రి మాట్లాడుతూ కష్టపడి చదివి తన లక్ష్యాన్ని చేరుకుందని ప్రశంసించారు. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్నట్లు తెలిపారు. రెండు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచి రాజేందర్, రాజు పాల్గొన్నారు.



బీబీపేటలో సన్మానిస్తున్న గ్రామస్థులు

బీబీపేట, న్యూస్‌టుడే: డీఎస్సీకి ఎంపికైన యువకులను బీబీపేటలో గ్రామస్థులు గురువారం సన్మానించారు. న్యామతాబాద్ సంతోష్(హిందీ పండిత్), చీమన్(ఎస్జీటీ), శ్యామ్(సాంఘిక శాస్త్రం)లను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్థులు సంతోశ్‌గౌడ్, దేవరాజు, శివ, హరీశ్, నవీన్, వెంకటేశ్, బాలు పాల్గొన్నారు.

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన సమితారెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో బీఈ సివిల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమని భాజాపా అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం విద్యార్థినిని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, శంకర్‌గౌడ్, గంగారెడ్డి, సాయిలు ఉన్నారు.



ఇస్సన్నపల్లిలో...

ఉత్తీర్ణతశాతం మెరుగవ్వాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణతశాతం మెరుగుపడాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కళాశాలకు హాజరయ్యేలా ప్రేరణ కలిగించాలని పేర్కొన్నారు. ప్రతీ నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పాల్గొన్నారు.

దుర్గమ్మ మండపాల్లో ప్రత్యేక పూజలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో దుర్గా మండపాల్లో గురువారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అర్చనలు, అన్నదానాలు జరిపారు.

'ప్రాజెక్టు ద్రోణ'లో ప్రతిభ

సదాశివనగర్, న్యూస్‌టుడే : ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ప్లాట్‌ఫారం సహాయంతో నిర్వహించిన 'ప్రాజెక్టు ద్రోణ' ఈ-కామర్స్ లెర్నింగ్ ప్రోగ్రాంలో సదాశివనగర్ మండలం మర్కల్ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సోని మధులత ప్రతిభ కనబర్చారు. ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించే అధ్యాపకులకు ఎమర్జింగ్ టెక్నాలజీ స్కిల్స్, ఇండస్ట్రీ సెంట్రిక్ ధోరణులలో శిక్షణ అందించారు. మధులత ప్రతిభ కనబరచడంతో ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ ఉదయిని, శ్రావణి, అకడమిక్ కో-ఆర్డినేటర్ వనజ తదితరులు అభినందించారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అధ్యాపకురాలు సోనీ మధులత

లారీని ఢీకొని ఒకరి మృతి

మాచారెడ్డి, న్యూస్‌టుడే: లారీని ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన పల్వంచ మండలం భవానిపేట శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానిపేటకు చెందిన గంగని రాములు(50) వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా.. రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు.



రాములు

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

చేగుంట, న్యూస్‌టుడే: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా మాసాయిపేట మండలం స్టేషన్‌మాసాయిపేట వద్ద గురువారం జరిగింది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. మృతుడికి సుమారు 55 ఏళ్లు ఉంటాయి. అతడి వద్ద ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేవు. స్టేషన్‌మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. అతడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే 87126 58591 నంబరులో సంప్రదించాలని రైల్వే ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత...

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను గురువారం అంజని గేటు వద్ద పట్టుకొని తహసీల్దార్ దశరథ్‌కు అప్పగించినట్లు ఎస్సై వివరించారు. ఒక్కొక్క ట్రాక్టరుకు రూ. 8వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.



పెద్దకొడప్‌గల్ ఠాణా ఆవరణలో నిలిపి ఉంచిన వాహనాలు

సీపీఎం జిల్లా మహాసభలకు తరలిరావాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో ఈ నెల 19న తలపెట్టిన సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. గురువారం కామారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తున్నామన్నారు. మహాసభల్లో పార్టీ బలోపేతంపై చర్చిస్తామన్నారు. భవిష్యత్ పోరాటాలపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మోతీరాంనాయక్, నర్సింలు, అరుణ్ తదితరులున్నారు.

వర్షం.. సంబరాలకు ఆటంకం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి మహిళలు వెళ్లగానే ఒక్కసారిగా వర్షం పడింది. దీంతో జనాలు షెడ్లు, ఇళ్లలోకి వెళ్లిపోయారు. సద్దులు తినే చోట ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.